క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: చీరాల మండలం గవినివారిపాలెం పంచాయితీ కావూరివారిపాలేనికి చెందిన కావూరి వీరాస్వామిరెడ్డికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అందించారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ తెలిపారు. జాబ్ మేళాకు పలు కంపెనీలు పాల్గొంటున్నాయని జేకేసీ కో–ఆర్డినేటర్ సాయిప్రసన్న తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఏదైనా డిగ్రీ పాస్, ఫెయిల్ అర్హత కలిగి ఉన్న వారు పూర్తి వివరాలతో కళాశాలలోని జేకేసీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

బ్లాక్‌స్పాట్ గుర్తింపుతో ప్రమాదాలు దూరం



డ్రమ్ములపై స్టిక్కరింగ్ చేస్తున్న పోలీసులు

జే.పంగులూరు: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు మేరకు మండలం పరిధిలోని రేణింగవరం పోలీసులు నో యాక్సిడెంట్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు ఆధ్వర్యంలో ప్రమాద నివారణ చర్యలో భాగంగా బ్లాక్ స్పాంట్ వద్ద నూతనంగా డ్రమ్ములు ఏర్పాటు చేశారు. వాటికి రేడియో స్టిక్కర్లు అంటించారు. సరైన పత్రాలు లేని 40 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఈ–చలానా విధించారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి ఆదాయం



బహుమతులు అందిస్తున్న డిపో మేనేజర్ శ్యామల

చీరాల అర్బన్: ఉద్యోగుల సమష్టి కృషితోనే ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుందని డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. శనివారం చీరాల ఆర్టీసీ డిపోలో గత నెలలో అధికంగా ఆదాయం తెచ్చిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. వీరిలో నాగరాజు (కండక్టర్), నళినిప్రియ (కండక్టర్)లకు బహుమతులు ఆమె అందించారు. మెళుకువలు పాటించి ఆయిల్ పొదుపు చేయడం వలన కూడా ఆదాయం తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దేవరాజ్

చీరాల: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ సూచించారు. శనివారం దేవరాజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని లూథరన్ జూనియర్ కళాశాల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. అలానే మున్సిపాలిటీలోని 300 కాలనీలో రామాలయంలో నిరుపేదలు, వృద్ధులకు దేవరాజ్ నిర్వహించారు. కార్యక్రమాల్లో కళాశాల సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

అద్దంకి రూరల్: సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు, కొమ్మాలపాడు గ్రామాల్లో శనివారం జిల్లా వనరుల కేంద్రం డీఆర్సీ డీడీఏ విజయ నిర్మల, డాట్ శాస్త్రవేత్త జీ. రమేష్ మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంటలను పరిశీలించి వాటిలో తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు, స్థానికులు పాల్గొన్నారు.

సిరులు కురిసెను.. ధరలు అదిరెను

- విరగ పండిన మెట్ట, మాగాణి చేలు
- అధిక దిగుబడులు, గిట్టుబాటు ధరలు
- గతంలో ఎన్నడూ లేని ఆనందంలో రైతన్నలు



పోతినవారిపాలెం వద్ద మిరపను ఎండబెట్టుకుంటున్న రైతన్నలు

కారంచేడు: మూడున్నర సంవత్సర కాలం నుంచి అన్నదాతలు సంతోషంగా ఉన్నారు. అన్నిటికన్నా మిన్నగా ప్రకృతి సహకరించడంతో రైతన్నల ఆనందాలకు అవధులు లేకుండాపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అన్నదాతలకు సిరుల పంటలు ఇంటి ముంగిటకు చేరాయి. వాతావరణ అనుకూల పరిస్థితులతో పాటు, పంట కాలువల నిండుగా ఉన్న సాగునీటితో ఈ ఏడాది మెట్ట, మాగాణి చేలు కళకళలాడుతున్నాయి. ఊహించని రీతిలో పంటల దిగుబడులు వస్తుంటే వాటిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు కళ్లాల వద్దకు క్యూ కడుతున్నారు. పెద్ద రైతులు మరింత గిట్టుబాటు ధరలు పెరుగుతాయనే ఆశతో వాటిని ఖర్చులకు వెనుకాడకుండా కోల్డ్ స్టోరేజీలకు తరలించుకుంటున్నారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని చీరాల, వేటపాలెం మండలాలు వరికి ప్రసిద్ధి అయితే కారంచేడు, పర్చూరు, చినగంజాం, ఇంకొల్లు మండలాలు సైతం వరి సాగుకు ప్రసిద్ధిగాంచాయి. ఇక మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు కొంత మేర మెట్ట పైర్లు మిరప, పొగాకు, శనగ సాగుకు పెట్టింది పేరు. ఈ ఏడాది రైతుల సాగు, దిగుబడులు, గిట్టుబాటు ధరలపై సాక్షి ఫోకస్.

జిల్లా ధాన్యాగారంగా కారంచేడు..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలోని అన్నదాతలు ప్రధానంగా కొమ్మమూరు ఆయకట్టుపైనే ఆధారపడుతుంటారు. కొమ్మమూరు ఆయకట్టుకింద చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు ఉంది. ఈ ఏడాది వరిసాగులో మంచి దిగుబడులు వచ్చాయి. గతంలో 25–30 బస్తాల వరకు ఉంటే ఈ ఏడాది 30–42 బస్తాల దిగుబడులు వచ్చాయి. గతంలో బస్తా రూ 1050–1150 వరకు ధరలుంటే ఈ ఏడాది కల్లాల వద్దనే బస్తా రూ 1580 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులు సుమారు 40 శాతం మంది అమ్మకాలు చేసుకుంటున్నారు.

ఎర్ర బంగారానికి భలే గిరాకీ..

ఎర్ర బంగారంగా పేరొందిన మిరప పంట ఈ ఏడాది విస్తారంగా వచ్చింది. ఎక్కడ చూసినా మిరప చేలు, కల్లాలు కళకళలాడుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు 22 వేల ఎకరాల్లో మిరప సాగు చేయగా ఎకరానికి సుమారు 25 కింటాళ్ల చొప్పున సగటున ఈ ప్రాంతంలో సుమారు 5.5లక్షల కింటాళ్ల పంట దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధరలు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా కల్లాల వద్దనే వ్యాపారులు క్వింటాకు రూ.23 వేల వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది మిరపకు సాగు ఖర్చు ఎకరానికి రూ 1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అయ్యిందని చెప్తున్నారు.

రెట్టింపు ఉత్సాహంతో వైట్‌బర్లీ రైతులు..

వైట్‌బర్లీ సాగు ఈఏడాది రెట్టింపు ఉత్సాహంతో సాగుతుంది. ఎలాంటి ప్రతికూల వాతావరణం లేకుండా వేసిన పంట వేసినట్టుగానే చేతికందుతుంది. దీంతో వైట్ బర్లీ సాగు చేసి రైతుల మోములో ఆనందం కనిపిస్తోంది. నియోజకవర్గంలో సుమారు 7800 ఎకరాల్లో వైట్‌బర్లీ సాగు అయ్యింది. గతంలో ఎకరానికి సుమారు 10–13 క్వింటాళ్ల దిగుబడులు వస్తే, ఈ ఏడాది ఎకరానికి 15–20 కింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ధరలకు కూడా గతంలో రూ.2500–4000 వరకు ఉంటే ఈ ఏడాది రూ.6 వేలు నుంచి రూ.7 వేల వరకు డిమాండ్ పలుకుతోంది. దీంతో పొగాకు రైతుల్లో ఎకరానికి సుమారు రూ.50 వేల వరకు లాభాలు వస్తాయని ఆశగా ఉన్నారు.

సిరులు కురిపిస్తున్న శనగ సాగు..

శనగ సాగు ఈ ఏడాది మరింత ఆశాజనకంగా మారింది. వరి తరువాత అధికంగా సాగు చేసే పంట శనగ. నియోజకవర్గంలో సుమారు 40500 ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. వాతావరణ పరిస్థితులను బట్టి ఈ ఏడాది ఎకరానికి జేజ–11 రకం 10–13 బస్తాలు, కాక్–2 రకం సాగులో ఎకరానికి సుమారు 8–11 బస్తాల దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం, వ్యాపారుల నుంచి శనగకు మంచి డిమాండ్ కనిపిసుండటంతో మంచి గిట్టుబాటు ధరలు వస్తాయనే ఆశతోనే రైతులున్నారు.



కారంచేడు ప్రాంతంలో వరి నూర్పిడి చేస్తున్న యంత్రం



యద్దనపూడి ప్రాంతంలో రెండో కోతకు సిద్ధంగా ఉన్న వైట్‌బర్లీ



చినగంజాం ప్రాంతంలో శనగ నూర్పిడి చేస్తున్న కూలీలు

అన్నదాతలు చాలా సంతోషంగా ఉన్నారు..



ఈ ఏడాది అన్నదాతలు సంతోషంగా ఉన్నారు. వాతావరణ అనుకూల పరిస్థితులు, ఎలాంటి తుఫానులు, అధిక వర్షాలతో వరదలు లేకపోవడంతో పంటలు అన్నీ సక్రమంగా ఇంటికి చేరుతున్నాయి. నేను 10 ఎకరాల్లో మిరప సాగు చేశా ఇప్పటికే 40 కింటాళ్ల పచ్చి మిరప కోశాను. మరో 20 కింటాళ్ల పండు మిరప సిద్ధంగా ఉంది. ఎకరానికి సుమారు 30 కింటాళ్ల దిగుబడులు వస్తాయని ఆశగా ఉంది.

– పోతిన వెంకట్రావు, మిరప రైతు, పోతినవారిపాలెం

అనేక రకాలుగా అవగాహన కల్పించాం..



అన్నదాతలకు మెట్ట, మాగాణి సాగుల్లో అనువైన సాగు కోసం అనేక రకాలుగా అవగాహన కల్పించాం. పొలంబడి ద్వారా ప్రతి గ్రామంలోనూ అన్ని రకాల పంటల్లో మంచి మెళుకువలు అందించాం. అనుకూల వాతావరణంతో తెగుళ్లు పెద్దగా రాకపోవడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. గిట్టుబాటు ధరలు కూడా అందుబాటులో ఉండటంతో అన్నదాతలు సంతోషంగా ఉన్నారు.

– కే శివనాగప్రసాద్, ఏవో, కారంచేడు

వాహనం అదుపుతప్పి దంపతులకు గాయాలు

మార్టూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి భార్యభర్తలు గాయపడిన ఘటన స్థానిక జాతీయ రహదారిపై ఇసుకదర్శి సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వేణుబాబు తన భార్యతో కలిసి చిలకలూరిపేట నుంచి బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. ఇసుకదర్శి ఫ్లైఓవర్ వద్ద వారి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. ప్రమాదంలో భార్యకు స్వల్ప గాయాలు కాగా, వేణుబాబు ఎడమ కాలుకు తీవ్ర గాయం కావటంతో 108 సిబ్బంది అతని నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

యువకుడికి తీవ్ర గాయాలు..

మండల కేంద్రం మార్టూరులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది అశోక్ వివరాల మేరకు.. మండలంలోని రాజుగారిపాలెం గ్రామానికి చెందిన రామకృష్ణ శుక్రవారం రాత్రి మార్టూరు సర్వీస్ రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ రామకృష్ణను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణను 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వెబ్ కాస్టింగ్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని

చీరాల: ఎమ్మెల్సీ ఎన్నికల వెబ్ కాస్టింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని హాజరై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్ కాస్టింగ్ ద్వారా చిత్రీకరిస్తారని చెప్పారు. ఈ ప్రక్రియకు చీరాల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకరరావు, హౌసింగ్ డీఈ గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు



కోటేశ్వరరావు (ఫైల్)

అద్దంకి: ఒకరి నేత్రదానంతో అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరికి చూపు వస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ మోటుపల్లి కోటేశ్వరరావు(60) శనివారం మృతి చెందాడు. ఆయన భార్య విజయలక్ష్మి, కుమార్తె సుష్మ సోదరుడు రామదాసు, రామకృష్ణల అనుమతితో కోటేశ్వరరావు కంటిలోని కార్నియాలను నేత్రదాన ప్రోత్సాహకులు రాచమల్లు శివాంజనేయులు, చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో శంకర్ నేత్రాలయ వైద్యులు సేకరించి ఐ బ్యాంకుకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు. కోటేశ్వరరావు మృతదేహాన్ని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య సందర్శించి నివాళి అర్పించారు.

ఘనంగా వీరరాఘవస్వామి బ్రహ్మోత్సవాలు



గరుడ పట పూజ నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో గల వీరరాఘవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గరుడ పటాధివాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా హోమ కార్యక్రమాన్ని నిర్వహించి సంతానం లేనివారు స్వామి వారి గరుడ ప్రసాదం అందించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ పర్యవేక్షించారు, అర్చకస్వామి దిట్టకవి వాసుదేవాచార్యులు, యాజ్ఞికులు తాళ్లూరి వెంకటేష్ ఆచార్యులు అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

65 బస్తాల రేషన్ బియ్యం సీజ్



బియ్యం బస్తాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

చీరాల టౌన్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ దుఖాణాన్ని తనిఖీ చేయగా బియ్యం బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈఘటన శనివారం రాత్రి పేరాల్లో చోటు చేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్ తెలిపిన వివరాల మేరకు.. పేరాలలోని 6వ నెంబర్ రేషన్ దుకాణంలో రేషన్ డీలర్ సాంబయ్య 65 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో డీఎస్‌వో విలియమ్స్ ఆదేశాలతో షాపును తనిఖీ చేయగా బియ్యాన్ని గుర్తించామన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డీలర్‌పై 6–ఏ కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని సమీప వీఆర్వోకు అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్ తెలిపారు.

వైభవంగా సత్యన్నారాయణస్వామి వ్రతాలు

కారంచేడు: మండంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన అలివేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారికి సత్యన్నారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజా కార్యక్రమాల్లో సుమారు 150 మందికి పైగా మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ సహకారంతో ప్రత్యేక పూజల తరువాత భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

లైసెన్స్‌లు లేకపోతే హోటళ్ల సీజ్



చికెన్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో హోటల్‌లు, దాబాలపై శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేవీ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ శింగరకొండ వెళ్లే రోడ్డులో ఉన్న ఓ దాబా హోటల్‌ను తనిఖీ చేయగా ఎటువంటి లైసెన్స్‌లు లేవని, కిచెన్ గది అపరిశుభ్రంగా నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. ఫ్రిజ్‌లో ఎక్కువ రోజులు నిల్వ ఉంచటంతో చికెన్ చెడువాసన వస్తోందన్నారు. లైసెన్స్‌లు 14 రోజుల్లోపు తీసుకోకపోతే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా పలు హోటల్‌లను తనిఖీచేసి లైసెన్స్‌లు లేని వారి వెంటనే పొందాలన్నారు. లేకుంటే పెనా ల్టీతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

శ్రీకృష్ణ అన్నదాన సత్ర కమిటీ అధ్యక్షుడిగా ప్రసాద్

అద్దంకి రూరల్: శింగరకొండలోని శ్రీకృష్ణ అన్నదాన సత్రానికి అధ్యక్షుడిగా ఎర్రిబోయిన ప్రసాద్‌యాదవ్‌ను శనివారం జరిగిన సంఘ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్ర అభివృద్ధికి కృషి చేస్తానని ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు మేలు



బాలింతకు బేబి కిట్ అందిస్తున్న వైద్యులు

జే.పంగులూరు: ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం అయిన బాలింతలకు అనేక ఉపయోగాలు ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యుడు మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని స్థానిక పీహెచ్‌సీ నందు శనివారం కోటపాడు గ్రామానికి చెందిన గర్భిణికి సాధారణ కాన్పు చేశారు. అనంతరం తల్లీబిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవం చేయించుకున్న వారికి జనని సురక్ష యోజన ద్వారా బాలింత సంరక్షణ కోసం రూ. 5 వేలు నగదు తోపాడు వైఎస్సార్ బేబి కిట్ ఇస్తారని తెలిపారు. భోజన సదుపాయాలతో పాటు, పుట్టిన బిడ్డకు వెంటనే టీకా, జనన ధ్రువీకరణ పత్రం, ఉచితంగా మందులు అందిస్తారని చెప్పారు. అంతేకాకుండా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా ఉచితంగా తల్లి ఇంటికి వద్దకు వారిని క్షేమంగా పంపిస్తారని వివరించారు. కార్యక్రమంలో రెండో వైద్యులు శివచెన్నయ్య, స్టాఫ్ నర్స్ క్రాంతి, సంధ్యారాణి, శివ, మార్తా, సూపర్‌వైజర్స్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరావునాయక్

యద్దనపూడి: చట్టం ఏ ఒక్కరి ప్రయోజనాల కోసం పనిచేయదని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని జూనియర్ సివిల్ జడ్జి వీ నాగేశ్వరావునాయక్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని చిమటవారిపాలెం, తనుబొద్దివారిపాలెం గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ పర్చూరు ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు నాయక్ మాట్లాడుతూ మన జీవితంలో చేసే ప్రతి పని చట్టానికి లోబడే ఉంటుందన్నారు. స్త్రీలు నేటి సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు సమాజం మరియు దేశం పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. గృహహింస చట్టం, ఉచిత న్యాయ సహాయం, ఆర్టీఐ యాక్ట్, బీమా చట్టం తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై శేషసాయి, సర్పంచ్‌లు వెంకట్రావు, వీరారెడ్డి, మువ్వల రాంబాబు, మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెళుకువలు పాటిస్తే దిగుబడులు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



అంబడిపూడి ఆర్బీకేలో రైతులతో మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల

జే.పంగులూరు: మొక్కజొన్న నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు మేరకు పంటలు పండించాలని ఒంగోలు డాట్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. మండల పరిధిలోని కొండమూరు గ్రామంలోని మొక్కజొన్న పంటలను శనివారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగుకు సంబంధించిన రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారి సలహాలు పాటిస్తే పెట్టుబడి తగ్గి తద్వారా రైతులకు లాభాలు చేకూరుతాయని తెలిపారు. పంట ఎదుగుదలకు 30 రోజుల పైరుకు ఎకరాకు 45 కేజీల యూరియా, 20 కేజీల పోటాష్ వాడాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన 3జీ గుళికలు వేసిన కాండం తొలుచు పురుగు నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా డీడీఏ డీటీసీ ఎం నిర్మలా, మార్టూరు డీడీఏ ఎం శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి, వీఏఏ దినేష్ రైతులు పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ: మొక్కజొన్న పైరును కత్తెర పురుగు ఆశించకుండా నివారణ చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ డీడీఏ విజయనిర్మల, శాస్త్రవేత్త జీ రమేష్ సూచించారు. శనివారం మండలంలోని వైదన అంబడిపూడి గ్రామాల్లో మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు. వ్యవసాయాధికారిణి ఎస్‌వీపి కుమారి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి



బల్లికురవ: నగదు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో



ఇంటి నిర్మాణాలపై సూచనలందిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

బల్లికురవ: జగనన్న కాలనీ లేఅవుట్‌లు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడిన ఎంపీడీవో అధికారులు బల్లికురవ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను మార్చి 20 వతేదీలోపు పూర్తిచేసి ఉగాదికి గృహప్రవేశాలు చేయాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. శనివారం మండల స్థాయి అధికారులతో కలిసి ఉప్పుమాగులూరు, గుంటుపల్లి, పెదఅంబడిపూడి గ్రామాల్లోని జగనన్న కాలనీల అవుట్లను పరిశీలించారు. ఉప్పుమాగులూరులో ఇరువురు మహిళలకు గ్రూపు నగదు అందజేశారు. గృహనిర్మాణ శాఖ ఈఈ దుర్గా రమేష్, వెలుగు ఏపీఎం బీ. సురేంద్ర బాబు, సెక్రటరీలు సీహెచ్ వరప్రసాదరెడ్డి, సీహెచ్ వెంకట సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

చీరాల టౌన్: ఉగాది పండుగ రోజు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. హౌసింగ్ డే పురస్కరించుకుని శనివారం చీరాల మండలంలోని చీరాల నగర్ 1, 2 లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటిని అందించి పేదల పెన్నిధిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. పనుల్లో జాప్యం జరగడంపై లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

6న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

అద్దంకి రూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఒంగోలులోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న మాదిగ అమర వీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని అద్దంకి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.